క్లుప్తంగా

దుర్వాసన భరించలేకపోతున్నాం..



అంబాజీపేటలో రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్త

అంబాజీపేట: అంబాజీపేట సెయింట్ మేరీస్, పశువుల ఆస్పత్రి ఎదురుగా ఉన్న చెత్త నుంచి దుర్వాసన వెదజల్లుతుందని తక్షణమే తొలగించేలా పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు, బాటసారులు, వాహనదారులు కోరుతున్నారు. స్థానికులు ప్రధాన రహదారి పక్కన చెత్తను పడవేయడంతో పందులు, కుక్కలు అక్కడ సంచరించి చిందరవందర చేస్తున్నాయన్నారు. దాంతో దుర్వాసన వెదజల్లడంతో రోగాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా దోమలకు నిలయంగా మారిందన్నారు. చెత్తను ఒక చోట వేసేలా కుండీని ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించాలని స్థానికులు కోరుతున్నారు. దుర్వాసన వెదజల్లుతున్న చెత్తను తొలగించి బ్లీచింగ్ చల్లించాలని ఆయా కాలనీ వాసులు కోరుతున్నారు.

విద్యార్థులుగా ఉన్నత విలువలు సాధిద్దాం

అంబాజీపేట: విద్యార్థినీ, విద్యార్థులు చదువుతో పాటు ఉన్నత విలువలను కూడా సాధించాలని గ్రంథాలయ రికార్డు అసిస్టెంట్ జి.శ్రీనివాస్ అన్నారు. అంబాజీపేట శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో పుస్తక పఠనాన్ని గురువారం చేయించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు గ్రంథాలయానికి రావడం వల్ల మేధాశక్తిని పెంచుకోవచ్చన్నారు. అనంతరం డ్రాయింగ్, నీతి కథలు, అల్లికలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

ఎమ్మెల్యే గిడ్డిని కలసిన నాయకులు



ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణను సన్మానిస్తున్న కూటమి నాయకులు

అంబాజీపేట: ఇటీవల సార్వత్రిక ఎన్నికల్లో పి.గన్నవరం ఎమ్మెల్యేగా గెలుపొందిన గిడ్డి సత్యనారాయణను కూటమి పార్టీ నాయకులు గురువారం మర్యాద పూర్వకంగా ఆయన స్వగృహంలో కలిశారు. ఎమ్మెల్యే గిడ్డిని టీడీపీ, జనసేన పార్టీ నాయకులు దుశ్శాలువా, పూల మాలలతో ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యేను కలసిన వారిలో గణపతి వీరరాఘవులు, రవణం రాము, మైపాల తాతాజీ, రేవు శ్రీను, సలాది బాబూరావు, సలాది పుల్లయ్యనాయుడు తదితరులు ఉన్నారు.

16న తిరుపతిలో కవితోత్సవం

సఖినేటిపల్లి: తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలో ఈ నెల 16న అంతర్జాతీయ సాహిత్య సంస్థ శ్రీశ్రీ కళావేదిక, యూనివర్సిటీ డైరెక్టరేట్ ఆఫ్ స్టూడెంట్స్ వెల్ఫేర్, కల్చరల్ ఎఫైర్స్ సంయుక్త ఆధ్వర్యంలో తిరుపతి కవితోత్సవం ఏర్పాటు చేసినట్టు వేదిక అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్ గురువారం తెలిపారు. సఖినేటిపల్లిలో మీడియాతో ఆయన మాట్లాడుతూ, తిరుపతి కవితోత్సవం పేరిట నిర్వహించే ఈ జాతీయ శతాధిక కవి సమ్మేళనంలో కవుల నమోదు ప్రక్రియ ద్వారా చేరిన 165 మంది కవులు పాల్గొంటారన్నారు. కాగా వేదిక నిరంతర సాహిత్య ప్రక్రియలో భాగంగా ఉభయ తెలుగు రాష్ట్రాలలో కవిత్వం, సాహిత్య వ్యాప్తికి ప్రతి నెలా ఆయా జిల్లాల్లో ఒక్కో జిల్లా ప్రాతిపదికన జాతీయ స్థాయిలో కవి సమ్మేళనాలు నిర్వహిస్తున్నామన్నారు. సాహిత్య చరిత్రలో ఇటువంటి ఒరవడిని ఇపుడే తెచ్చామన్నారు. తిరుపతిలో 135వ జాతీయ శతాధిక కవి సమ్మేళనం ఇందులో భాగంగా నిర్వహిస్తున్నట్టు ప్రతాప్ తెలిపారు.

పాలిసెట్ వెబ్ కౌన్సెలింగ్‌కు 107 మంది హాజరు

అయినవిల్లి: ముక్తేశ్వరం వైవీఎస్ అండ్ బీఆర్ఎం కళాశాలలో గురువారం 2024 పాలిసెట్ వెబ్ కౌన్సెలింగ్‌కు 107 మంది విద్యార్థులు హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె.విశాల తెలిపారు. 1,08001 నుంచి చివరి ర్యాంకు వరకూ వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించామన్నారు. 107 మంది విద్యార్థులకు చెందిన సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేశామని తెలిపారు.

వైభవంగా తాటమ్మ తీర్థం

పి.గన్నవరం: గ్రామంలో వేంచేసిన తాటమ్మ వారి తీర్థ మహోత్సవం గురువారం వైభవంగా జరిగింది. గ్రామస్తులు, ఆడపడుచులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. భక్తులు బ్యాండు మేళాలతో తరలివచ్చి గరగలు తదితర మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. ఆలయం వద్ద ఉదయం నుంచి భక్తులు పెద్ద ఎత్తున బారులు తీరారు. వివిధ గ్రామాలకు వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ ట్రస్టీ సుంకర రాంబాబు ఆధ్వర్యంలో ఏర్పాట్లు నిర్వహించారు. స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

దోమ కాటు.. ఆరోగ్యానికి చేటు

- మలేరియాపై పోరాటం వేగవంతం
- ఈ నెల 30 వరకు మాసోత్సవాలు
- ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు



మామిడికుదురు మండలం పాశర్లపూడిలో అవగాహన కార్యక్రమం

మామిడికుదురు: ప్రపంచ వ్యాప్త ఆరోగ్య సమతుల్యత సాధనకై మలేరియా వ్యతిరేక పోరాటాన్ని వేగవంతం చేద్దామంటూ ఆరోగ్య కార్యకర్తలు ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ నెల ఒకటో తేదీ నుంచి 30వ తేదీ వరకు మలేరియా వ్యతిరేక మాసోత్సవాలను నిర్వహించాలని వైద్య ఆరోగ్య శాఖ నిర్ణయించింది. జాతీయ కీటక జనిత వ్యాధి నియంత్రణ కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టారు. వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో, ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు చేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వివరిస్తున్నారు. నిల్వ నీటిలో దోమలు వృద్ధి చెందకుండా నివారణ మందులను స్ప్రే చేయాలని సూచిస్తున్నారు. గంబూషియా చేపలను వదలడం ద్వారా దోమల లార్వాలను అరికట్టవచ్చని సూచిస్తున్నారు. ఇళ్లలోని గోడలపై సింథటిక్ పైరిథ్రాయిడ్ (ఏసీఎం) అవసరాన్ని బట్టి దోమల మందులను స్ప్రే చేయాలని అవగాహన కల్పిస్తున్నారు. దోమ తెరలు, దోమ చక్రాల ద్వారా దోమల నుంచి రక్షణ పొందవచ్చని సూచిస్తున్నారు.

మలేరియా లక్షణాలు

చలి, వణుకుతో కూడిన జర్వం, అనాఫిలిస్ దోమల ద్వారా వ్యాపిస్తుందని చెబుతున్నారు. ప్లాస్మోడియా జాతికి చెందిన రెండు క్రిముల వల్ల మలేరియా వ్యాప్తి చెందుతుందని పేర్కొంటున్నారు. దీనిలో వైవాక్స్ మలేరియా తక్కువ బాధిస్తే, పాల్సీఫారం మలేరియా ఎక్కువ బాధించడమే కాకుండా కొన్ని పరిస్థితుల్లో ప్రాణాంతక స్థాయికి చేరుతుందని విశ్లేషిస్తున్నారు. దోమ కుట్టిన ఎనిమిది నుంచి 12 రోజుల్లో వ్యాధి లక్షణాలు బయటపడతాయని, చిన్న పిల్లలకు, గర్భిణులకు ఈ వ్యాధి ప్రమాదకరమైనదని చెబుతున్నారు. రక్త పరీక్షలు అనగా (బీయస్), (ఆర్డీ టెస్ట్) ద్వారా ఈ వ్యాధిని నిర్ధారించవచ్చని పేర్కొంటున్నారు.

విస్తృతంగా కార్యక్రమాలు



మలేరియా వ్యాధిపై ప్రజల్లో చైతన్యం తీసుకు వచ్చేందుకు విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. అవగాహన ర్యాలీలు నిర్వహించడంతో పాటు ముంపునీరు నిల్వ ఉన్న ప్రాంతాలకు వెళ్లి ముంపునీటిని వెంటనే తొలగించాలని చెబుతున్నాం. దోమల నిర్మూలన మందు పిచికారీ చేయిస్తున్నాం. ఎప్పటికప్పుడు ఆ కార్యక్రమంపై ప్రజల్లో అవగాహన కల్పించడం ద్వారా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో కార్యాచరణ చేపడుతున్నాం.

– కేవీ సూర్యనారాయణ, హెల్త్ అసిస్టెంట్, పాశర్లపూడి సబ్ సెంటర్

ప్రజల్లో చైతన్యం తీసుకు వస్తున్నాం



రాజోలు సబ్ యూనిట్ పరిధిలో ఇంత వరకు మలేరియా కేసులు నమోదు కాలేదు. వర్షాకాలం కావడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. మలేరియాపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం. ఐఈసీ, ఆశ, అంగన్‌వాడీ వర్కర్లు, స్వచ్ఛంద సంస్థల ద్వారా వ్యాధి, నివారణ చర్యలపై ప్రజల్లో చైతన్యం తీసుకు వస్తున్నాం. వ్యాధి నివారణ అనేది మనం తీసుకునే జాగ్రత్తలపైనే ఆధారపడి ఉంటుంది.

– మానుకొండ రాజశేఖర్, సబ్ యూనిట్ ఆఫీసర్, రాజోలు

పరిసరాల పరిశుభ్రత పాటించాలి




మలేరియా వ్యాధి అనాఫిలిస్ అనే ఆడ దోమల వల్ల వ్యాప్తి చెందుతుంది. మలేరియా వ్యాధి వ్యాప్తి స్థానిక పరిస్థితులపై, పరిసరాల పరిశుభ్రతపై ఆధారపడి ఉంటుంది. ఈ వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే డాక్టర్లను సంప్రదించాలి. రక్త మార్పిడి సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. లక్షణాలు కనిపించిన వెంటనే రక్త పరీక్షలు చేయించుకోవాలి. ఏ మాత్రం నిర్లక్ష్యం చేయకుండా డాక్టర్ల సూచనలు పాటించాలి.

– డాక్టర్ స్వర్ణలత, వైద్యాధికారి, నగరం పీహెచ్‌సీ

కొత్తపేటలో మూడోస్థానం 'నోటా'దే

- నోటాకు 1558 ఓట్లు
- పోస్టల్ బ్యాలెట్లలో చెల్లనివి 95



ఇతర అభ్యర్థులకు పోస్టల్ బ్యాలెట్లతో కలిపి పడిన ఓట్ల వివరాలు

కొత్తపేట: జరిగిన సార్వత్రిక ఎన్నికల ప్రజాతీర్పుకు సంబంధించి కొత్తపేట అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రధాన టీడీపీ, వైఎస్సార్ సీపీ అభ్యర్థుల తరువాత అభ్యర్థుల కంటే 'నోటా'కే ఎక్కువ ఓట్లు పడ్డాయి. నోటా మూడోస్థానం దక్కించుకుంది. పోస్టల్ బ్యాలెట్లలో 95 ఓట్లు చెల్లనివిగా గుర్తించారు. నియోజకవర్గంలో మొత్తం 13 మంది అభ్యర్థులు పోటీ చేయగా వారిలో విజేతగా నిలిచిన టీడీపీ అభ్యర్థి బండారు సత్యానందరావుకు ఈవీఎం అండ్ పోస్టల్ బ్యాలెట్ల ద్వారా 1,34,286 ఓట్లు పడగా, వైఎస్సార్ సీపీ అభ్యర్థి చిర్ల జగ్గిరెడ్డికి 77,807 ఓట్లు పడ్డాయి. వారి తరువాత నోటాకు 1,575 ఓట్లు పడ్డాయి. 2,204 పోస్టల్ బ్యాలెట్స్ పోలవగా వాటిలో 17 నోటాకు పడ్డాయి. 95 బ్యాలెట్ ఓట్లు చెల్లకుండా పోయాయి.

కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఈశ్వరరావు రౌతుకు 1,146 ఓట్లు, బీఎస్పీ అభ్యర్థి కాంద్రు వెంకటేశ్వరావుకు 585, జై భారత్ నేషనల్ పార్టీ అభ్యర్థి అరుణకిరణ్ సత్యాలకు 429, లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి దడాల చంద్రరావుకు 130, నవరంగ్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బండారు శ్రీనివాసరావుకు 92, స్వతంత్ర అభ్యర్థులు బొచ్చా శ్రీనివాసరావు (గాజు గ్లాసు గుర్తు) 685, మెర్ల శాస్త్రులుకు 69, రాయుడు రాజుకు 194, సలాది వీవీడీ సత్యనారాయణమూర్తికి 194, ఎ.సుధాకర్‌కు 244, సుంకర లక్ష్మీమణికుమారికి 145 ఓట్లు పడ్డాయి.

డిపాజిట్ కోల్పోయిన 11 మంది అభ్యర్థులు

ఈ ఎన్నికల్లో పోటీ చేసిన 13 మందిలో ప్రధాన టీడీపీ, వైఎస్సార్ సీపీ అభ్యర్థులు మినహా మిగిలిన 11 మంది డిపాజిట్ కోల్పోయారు. (అభ్యర్థికి పోలై చెల్లిన ఓట్లలో 1/6 వంతు ఓట్లు (ప్రతి 6 ఓట్లలో 1 ఓటు) పడితే డిపాజిట్ దక్కుతుంది. నామినేషన్ వేసినప్పుడు ఎన్నికల అధికారి వద్ద డిపాజిట్ చేసిన నగదును అభ్యర్థికి తిరిగి చెల్లిస్తారు.) అలా పై 11 మందికి తగిన ఓట్లు పడకపోవడంతో డిపాజిట్ కోల్పోయారు.

పార్లమెంట్ ఓట్లు ఇలా..

అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని కొత్తపేట అసెంబ్లీ నియోజకవర్గంలో ఈవీఎంల ద్వారా టీడీపీ అభ్యర్థి జీఎం హరీష్ (బాలయోగి)కి 1,34,769 ఓట్లు, వైఎస్సార్ సీపీ అభ్యర్థి రాపాక వరప్రసాద్‌కు 74,858 ఓట్లు పడ్డాయి. ఇక్కడ అసెంబ్లీ, పార్లమెంట్ అభ్యర్థులకు క్రాస్ ఓటింగ్ జరిగింది. అసెంబ్లీ వైఎస్సార్ సీపీ అభ్యర్థి జగ్గిరెడ్డికి ఈవీఎంల ద్వారా 77,098 ఓట్లు పడగా, ఎంపీ అభ్యర్థి రాపాకకు 74,858 ఓట్లు పడ్డాయి. అలా జగ్గిరెడ్డి 2,240 ఓట్లు ఎక్కువ సాధించారు. టీడీపీ అభ్యర్థుల విషయంలో రివర్స్ అయ్యింది. టీడీపీ ఎంపీ అభ్యర్థి జీఎం హరీష్‌కు 1,34,769 ఓట్లు పడగా అసెంబ్లీ అభ్యర్థి బండారు సత్యానందరావుకు 1,32,951 ఓట్లు పడ్డాయి. బండారు కంటే హరీష్ 1,818 ఓట్లు ఎక్కువ సాధించారు. ఆ విధంగా ఈ నియోజకవర్గంలో జగ్గిరెడ్డికి ఓటు వేసిన ఓటర్లలో 2,240 మంది పార్లమెంట్ ఈవీఎంలలో రాపాకకు కాకుండా ఇతర అభ్యర్థులకు ఓటు వేశారు.

ఫైబర్ నెట్ సేవలకు అంతరాయం

మలికిపురం: రాజోలు నియోజకవర్గంలో గురువారం ఏపీ ఫైబర్‌నెట్ సేవలకు అంతరాయం ఏర్పడింది. రాష్ట్ర వ్యాప్తంగా సాంకేతిక లోపం తలెత్తడం వల్ల ఈ పరిస్థితి నెలకొంది. దీంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నెట్‌వర్క్ ఎప్పటికి వస్తుందో తెలియక వినియోగదారులు అవస్థలు పడుతున్నారు.

వైభవంగా గొల్లాలమ్మ జాతర



గొల్లాలమ్మ వారు

ఆలమూరు: మండలంలోని పినపళ్లలో వేంచేసిన గొల్లాలమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవాలు గురువారం వైభవంగా జరిగాయి. రంగుల కాగితాలతో అలంకరించిన గరగతో అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించగా మహిళలు పసుపు, కుంకుమ, చీర, రవికలు సమర్పించారు. గొల్లాలమ్మ అమ్మవారిని తాటి పట్టెలపై ఊరేగించడం, చీరలపై నడిచి పుట్టింటికి వెళ్లి ఆడపడుచు లాంచనాలు స్వీకరించడం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. స్థానిక గానుగ చెట్టు వీధి, ఆంజనేయస్వామి ఆలయం వద్ద నృత్య కళాకారులు చేపట్టిన గవ్వ నృత్యం భక్తులను మంత్రముగ్ధులను చేసింది. గవ్వ నృత్య కళాకారుడికి కోళ్లను నైవేద్యంగా అందించి గ్రామస్తులు తమ మొక్కులను తీర్చుకున్నారు. గ్రామం నలుమూలల నుంచి వచ్చిన భక్తులు తమ తమ చంటిపిల్లలతో కాగడాలు వెలిగించి కావిడి కోళ్ల సమర్పించారు. భక్తులు ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నైవేద్యాలను సమర్పించి తమ మొక్కులను తీర్చుకున్నారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ ప్రతినిధులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అయితే బుధవారం రాత్రి ఏకధాటిగా కురిసిన భారీ వర్షంతో జాతరకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

ఉపాధి వేతనాలు చెల్లించాలి

మలికిపురం: ఉపాధి హామీ కూలీల వేతన బకాయిలు ఖాతాల్లోకి తక్షణమే జమ చేయాలని ఉపాధి కూలీ సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఉపాధి కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు ముత్యాల శ్రీనివాసరావు గురువారం ప్రభుత్వాన్ని కోరారు. కూలీలకు నాలుగు వారాల వేతన బకాయిలు అందాల్సి ఉందని, ప్రస్తుతం ఐదో వారం పనులు జరుగుతున్నాయని అన్నారు. పని చేసిన 15 రోజుల్లో వేతనాలు చెల్లించాలని ఉపాధి హామీ చట్టం చెబుతున్నప్పటికీ, అధికారుల నిర్లక్ష్యం వల్ల కూలీలు ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే వేతనాలు చెల్లించి కూలీలను ఆదుకోవాలని ఆయన కోరారు.

నియోజకవర్గ అభివృద్ధే ప్రధానం

రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్



మలికిపురంలో రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌ను అభినందిస్తున్న అభిమానులు

మలికిపురం: రాజోలు నియోజకవర్గ సమగ్రాభివృద్ధే ప్రధాన లక్ష్యమని రాజోలు నూతన ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పేర్కొన్నారు. నూతనంగా ఎమ్మెల్యేగా గెలుపొంది తొలిసారి నియోజక వర్గం చేరుకున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌ను నియోజకవర్గ ప్రజలు, జనసేన, టీడీపీ, బీజేపీ తదితర కూటమి నాయకులు మలికిపురంలోని ఎల్ఎస్ ల్యాండ్ మార్కు వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాలు అందించి అభినందించారు. ఆయన మాట్లాడుతూ అఖండ విజయం అందించిన ప్రజలందరికీ అభినందనలు తెలిపారు. నియోజకవర్గంలోని ప్రజలందరి సమస్యలతో పాటు, నియోజకవర్గంలోని గ్రామాల్లో దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను పరిష్కరించి అభివృద్ధి పథంలో ముందుకు సాగుదామని అన్నారు. తన విజయానికి అహర్నిశలూ శ్రమించిన కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. పార్టీ నియోజకవర్గ సమన్వయ కర్త గుండుబోగుల పెదకాపు, లింగోలు పెద్దబ్బులు, నాయకులు అడబాల సాయిబాబు, కాకి లక్ష్మణరావు, మంగెన నాని తదితరులు పాల్గొన్నారు.

రాజోలు ఎమ్మెల్యేకు మంత్రి పదవి ఇవ్వాలి

మామిడికుదురు: రాజోలు నియోజకవర్గానికి ప్రాధాన్యం ఇవ్వాలని జనసేన పార్టీ కార్యకర్తల సమావేశం కోరింది. మామిడికుదురులో పార్టీ నాయకుడు ఈలి రాంబాబు స్వగృహం వద్ద గురువారం జరిగన సమావేశంలో పార్టీ మండల శాఖ ఉపాధ్యక్షుడు దొడ్డా జయరామ్ మాట్లాడుతూ రాజోలు నియోజకవర్గాన్ని గుండెల్లో పెట్టుకుంటానని జనసేన అధినేత పవన్ కల్యాణ్ పలు సందర్భాల్లో పేర్కొన్నారని గుర్తు చేశారు. 2019తో పాటు ప్రస్తుత ఎన్నికల్లోను జనసేనకు రాజోలు నియోజకవర్గ ప్రజలు తిరుగులేని విజయాన్ని అందించారన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని రాజోలు నుంచి విజయం సాధించిన జనసేన అభ్యర్థి దేవ వరప్రసాద్‌కు మంత్రి వర్గంలో స్థానం కల్పించాలన్నారు. కూటమికి అండగా నిలిచిన నియోజకవర్గంలోని ప్రజలతో పాటు రాష్ట్ర ప్రజలకు సమావేశం కృతజ్ఞతలు తెలిపింది. సమావేశంలో పార్టీ నేతలు యింటి మహేంద్ర, రుద్రా శ్రీనివాస్, పెసంగి కనకరాజు, జె.రాజు, కటకంశెట్టి రామకృష్ణప్రసాద్, కె.నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

అవినీతి రహిత దేశంగా భారత్



అంతర్వేదిపాలెంలో కేక్ కట్ చేస్తున్న బీజేపీ నాయకులు

సఖినేటిపల్లి: భారత దేశాన్ని అవినీతి రహిత దేశంగా గత పదేళ్ల పాలనలో ప్రధాని నరేంద్ర మోదీ తీర్చిదిద్దారని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మాలే శ్రీనివాస నగేష్, రాష్ట్ర కిసాన్ మోర్చా డ్రెయినేజీ సెల్ కన్వీనర్ చెంపాటి శివరామకృష్ణంరాజు అన్నారు. గురువారం అంతర్వేదిపాలెంలో స్థానిక బీజేపీ బూత్ కమిటీ ఆధ్వర్యాన ప్రధానిగా మోదీ మూడోసారి ప్రమాణ స్వీకారం చేస్తున్న తరుణంలో పార్టీ క్యాడర్‌తో కలిసి వారు కేక్ కట్ చేశారు. అలాగే గ్రామస్తులకు మిఠాయిలు పంచారు. సమావేశంలో మాలే, చెంపాటి మాట్లాడుతూ, సంక్షేమం, అభివృద్ధి అందించడంలో ప్రధానిగా మోదీ ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారన్నారు. అటు కేంద్రంలో, ఇటు రాష్ట్రంలో ఎన్డీఏ విజయం సాధించడంపై వక్తలు హర్షం వ్యక్తం చేశారు. టీడీపీ, బీజేపీ నాయకులు అంతర్వేదిపాలెం పుల్లయ్య, మంగళంపల్లి బులిబాబు, దంతులూరి నరసింహవర్మ, యు.రామకృష్ణంరాజు, పోలిశెట్టి గంగ, పెనుమచ్చ వాసురాజు, అల్లూరు సుబ్బరాజు పాల్గొన్నారు. అలాగే గొందిలో బీజేపీ మండల అధ్యక్షుడు పట్టపు సూర్యప్రకాశరావు అధ్యక్షతన సంబరాలు నిర్వహించారు. ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ మెంబర్ అడబాల సత్యనారాయణ, నియోజకవర్గ కన్వీనర్ అడబాల రాంబాబు పాల్గొన్నారు.

శనైశ్చరునికి తైలాభిషేకాలు



మందపల్లి శనైశ్చరాలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కొత్తపేట: శనిదోష నివారణకు ప్రసిద్ధి చెందిన మందపల్లి ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామివారిని గురువారం అత్యధిక సంఖ్యలో భక్తులు దర్శించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపించారు. వైశాఖ బహుళ అమావాస్య పర్వదినం పురస్కరించుకుని దేవదాయ–ధర్మదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్, దేవస్థానం ఈఓ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో స్వామివారి పూజలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రతి శనివారం మాదిరిగా భక్తులు స్వామిని దర్శించుకున్నారు. ముందుగా ప్రాతఃకాల సమయంలో ఆలయ ప్రధాన అర్చకుడు అయిలూరి శ్రీరామమూర్తి ఆధ్వర్యంలో అర్చకులు, వేదపండితులు స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. భక్తులు ప్రత్యక్షంగా, పరోక్షంగా తైలాభిషేకాలు, పూజల ద్వారా దేవస్థానానికి రూ.1,33,075, అన్నప్రసాదం విరాళాల రూపంలో రూ.10,620తో కలిపి మొత్తం రూ.1,43,695 ఆదాయం వచ్చినట్టు ఏసీ అండ్ ఈఓ విజయలక్ష్మి తెలిపారు. పట్టిసీమకు చెందిన భక్తుడు సత్యనారాయణగుప్తా అన్నదానం పథకానికి రూ.10,120 విరాళంగా అందజేసినట్టు తెలిపారు. పలువురు ప్రముఖులు, అధికారులు స్వామిని దర్శించుకున్నారు.

ఇంటర్ ఉత్తమ విద్యార్థులకు సత్కారం



ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను సత్కరిస్తున్న స్వచ్ఛంద సంస్థ సభ్యులు

పి.గన్నవరం: ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను గురువారం పి.గన్నవరంలో మమత స్వచ్ఛంద సేవా సమితి అధ్యక్షుడు కోరుకొండ జాన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించి, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమా మాట్లాడుతూ విద్యార్థులు ఉత్తమ విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. మమత స్వచ్ఛంద సేవా సమితి అందిస్తున్న సేవలను అభినందించారు. సమితి అధ్యక్షుడు జాన్ బర్త్ డే సందర్భంగా కేకును కట్ చేశారు. జెడ్పీ మాజీ ప్రతిపక్ష నేత సాకా ప్రసన్న కుమార్, ఎంఈఓ కోన హెలీనా, ఐఈ కుమార్, సాయితేజ విద్యాసంస్థల అధినేత అన్నాబత్తుల అనుబాబు, గ్రేస్ కళాశాలల ప్రిన్సిపల్ పీవీఆర్ నాయుడు, చెవ్వాకుల భరత్, నల్లా పెదకాపు, గురుకుల పాఠశాలల ప్రిన్సిపల్స్ నక్కా శ్రీనివాస్, పెన్నేటి లలిత కుమారి, కె.కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక శిక్షణ తరగతులు



గుమ్మిలేరులో ఆధ్యాత్మిక తరగతులు నిర్వహిస్తున్న టీటీడీ ప్రాజెక్టు అధికారి ఆనంద తీర్థాచార్యులు

ఆలమూరు: మండలంలోని గుమ్మిలేరులో గురువారం హరే శ్రీనివాస భజన బృందానికి శిక్షణ తరగతులు జరిగాయి. ఆలమూరు అయ్యప్పస్వామి ఆలయ వ్యవస్థాపకుడు ఎం.ముకేందరస్వామి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ ఆధ్యాత్మిక శిక్షణ తరగతులకు తిరుమల తిరుపతి దేవస్థానం ప్రాజెక్టు అధికారి ఆనంద తీర్థాచార్యులు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆలమూరు, కపిలేశ్వపురం మండలాల నుంచి హాజరైన హరే శ్రీనివాస భక్త బృంద సభ్యులకు ఆధ్యాత్మికతను ప్రచారం చేయాల్సిన విధానాన్ని వివరించారు. ప్రతి ఒక్కరూ వేంకటేశ్వరుని చరిత్రను హిందువుల అందరికీ వివరించాలన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

రావులపాలెం: మండలంలోని ఈతకోట, రావులపాలెం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు అమలాపురం ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.రవికుమార్ గురువారం తెలిపారు. ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఈతకోట సెక్షన్ పరిధిలోని గోపాలపురం, ఈతకోట, ముమ్మిడివరప్పాడు, లక్ష్మి పోలవరం, పొడగట్లపల్లి, మట్లదొడ్డి, దేవరపల్లి, వేదిరేశ్వరం, కోసూరునగర్, గరువు, కేతరాజుపల్లి, చెల్లిరేవు ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు. అలాగే రావులపాలెం సబ్‌స్టేషన్ పరిధిలో ఊబలంక గ్రామం, రావులపాలెం డిగ్రీ కాలేజీ ఏరియా, అంకాలమ్మ గుడి ఏరియా ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి పదకొండు గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

రావులపాలెం: పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఎస్‌రావు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం కళాశాలలో అవగాహన సదస్సు, మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఎస్‌రావు ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రతి పౌరుడు పర్యావరణాన్ని రక్షించాలని, దీనిలో భాగంగా మొక్కలు నాటాలన్నారు.

ఘనంగా చండీహోమం



చింతలూరులోని నూకాంబిక అమ్మవారి ఆలయంలో చండీహోమం నిర్వహిస్తున్న వేద పండితులు

ఆలమూరు: మండలంలోని చింతలూరులో వేంచేసిన నూకాంబిక అమ్మవారి ఆలయంలో వైశాఖ మాస బహుళ అమావాస్యను పురస్కరించుకుని గురువారం అత్యంత వైభవంగా చండీహోమం జరిగింది. ఈఓ ఎంఎస్‌ఆర్ కృష్ణ, జేఏ డి.భాస్కర శ్రీనివాసు ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు చండీహోమంలో పాల్గొన్నారు. అనంతరం నూకాంబిక అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన భక్తులు భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. అమ్మవారి ఆలయ ఆవరణలో ప్రతి నెలా అమావాస్య రోజున చండీహోమం నిర్వహిస్తున్నట్లు ఈఓ కృష్ణ తెలిపారు. ఈ హోమంలో ప్రతి నెలా పాల్గొనే భక్తులు స్థానిక దేవదాయశాఖ కార్యాలయాన్ని సంప్రదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.